# గెలుపెవరిది?

—ఎస్. పద్మావతీదేవి



"మేడమ్! మీ కోసం ప్రత్యూషగారట, వచ్చారు. బయట వరండాలో ఉన్నారు." ప్యూన్ వచ్చి చెప్పగానే చూస్తున్న ఫైల్ మూసి పక్కన పెట్టి వరండాలోకి నడిచింది ధాత్రి.

"హలో... ఏమిటీ ఆకస్మిక దర్శనం?" చిరునవ్వుతో పలకరించింది.

ప్రతిగా నవ్వలేదు ప్రత్యూష.

"నేనింటికి వెళ్తాను తాళాలు ఇయ్యి." సీరియస్‌గా అడిగింది. ధాత్రికి ఏదో అనుమానం తోచింది. "ఏమైందే, ఏదైనా ప్రణయ కలహమా?" కొంటెగా నవ్వుతూ అడిగింది.

"ప్లీజ్ ధాత్రీ! నేనిప్పుడేం చెప్పలేను. రాగలిగితే నాతో రా. లేదా తాళాలు ఇవ్వు. నీ కోసం ఎదురుచూస్తూ వుంటాను."

మౌనంగా బాగ్‌లో నుంచి తాళంచేతులు తీసి ఇచ్చింది ధాత్రి. "నాకు కొద్దిగా వర్క్ మిగిలిపోయింది. అది పూర్తిచేసి ఒక గంటలో వస్తాను. ఫ్లాస్క్‌లో కాఫీ ఉంటుంది. త్రాగు."

"థాంక్స్..." ముక్తసరిగా చెప్పేసి తాళాలు తీసుకుని వెళ్ళిపోయింది ప్రత్యూష.

"నువ్వు తొందరపడ్డావు ప్రత్యూషా! తను ఆవేశంలో ఏదో అంటే నువ్విలా అలిగి వచ్చేయటం ఏం బాగులేదు. ఆ ఆవేశం తగ్గాక తనే పశ్చాత్తాపపడతాడు. నువ్వు కొంచెం ఓపిక పట్టవలసింది."

"అవునే, నేనే ఓపిక పట్టాలి. నేనే సహనం వహించాలి. నేనే రాజీపడాలి. ఎందుకంటే నేను ఆడదాన్ని కదా! భర్త పాదాలు తప్పిస్తే మరో దిక్కులేని దాన్ని

భార్యాభర్తల సహజీవనం ఏ అంశాల పైన ఆధారపడి వుంటుంది? ఇద్దరి మధ్యా పంతాలు-పట్టింపులు రావడానికి ఎలాంటి కారణాలు దోహదం చేస్తాయి? సరైన అవగాహన లేకపోతే మనస్పర్థలు వస్తాయంటారు. ఒకరినొకరు అవగాహన చేసుకోవడం అంటే, ఒకరు మరొకరికి లొంగి పోవాలా? అవసరం లేదు. కానీ ఏ విషయంలోనైనా సరైన నిర్ణయాలు తీసుకోవడమనేది ఆ ఇద్దరిమధ్య గల అనుబంధాన్నిబట్టీ, ఆ వ్యక్తుల్లోని సంస్కారాన్ని బట్టీ వుంటుంది. ఐతే, సరైన నిర్ణయాలు సరైన సమయంలో తీసుకోకపోతే, ఆ సంసారం ఏమౌతుంది?

కదా! భర్త ఏమన్నా సహించాలి, ఓర్పు వహించాలి..."

"అబ్బబ్బ.... నీ ధోరణే నీది కాని ఎదుటివాళ్ళు చెప్పింది వినవు కదా! అసలు..."

"ఏం చెప్తావు నువ్వు? నేను వూరికే కారణం లేకుండా వచ్చేస్తానా? ఇదిగో ధాత్రీ! నాకు ఒక్క వారం రోజులు ఇక్కడ ఆశ్రయం కావాలి. ఇవ్వగలవా, లేదా చెప్పు?" తీక్షణంగా అడిగింది.

"ప్రత్యూషా! నువ్వు ఆనంద్‌ని ప్రేమించావు. కోరి పెళ్ళి చేసుకున్నావు..."

"అవునే, అందుకే... అందుకే మూడేళ్ళపాటు నా ఆశలని, కోరికలని, అలవాట్లనీ అభిప్రాయాలనీ అన్నీ... అన్నీ చంపుకుంటూ గడిపాను. కానీ దానికి కూడా ఓ లిమిట్ అంటూ ఉంటుంది. నిజం ధాత్రీ! ఆనంద్‌కి నేనంటే ప్రాణం. కానీ ఏం లాభం? నేను తన చేతిలో కీలుబొమ్మని కావాలి. నాకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ఉండకూడదు. నాకంటూ వేరే అభిప్రాయాలుండకూడదు. నాకంటూ ఫ్రెండ్స్ ఉండకూడదు. నాకంటూ ఓ ప్రపంచం అనేది ఉండకూడదు. నా ఫ్రెండ్స్‌తో నేను మాట్లాడకూడదు. వాళ్ళు మా ఇంటికి రాకూడదు. అవసరం పడినా సరే నేను వాళ్ళవెంట స్కూటర్ మీద వెళ్ళకూడదు. ఇదంతా అనుమానం అనుకున్నావా? నతింగ్ బట్ జెలసీ. నేను ఎంతని ఓర్పుగా ఉండాలే... అసలు మా పెళ్ళయి మూడేళ్ళు అవుతుంది. ఇంతవరకూ నన్ను తను ఏ మాత్రం అర్థంచేసుకున్నాడు? పరాయి మగాడితో పని ఉండి మాట్లాడితే నేను తనకి కాకుండా పోతానా? ఏమైనా అంటే 'లోకం అలా అనుకోదు' అంటాడు. నేను అప్పటికీ అంటాను, 'నువ్వు నన్ను నమ్మితే చాలు. నాకు ఈ ప్రపంచంతో పనిలేదు' అని. అంటే, నాకు లేకపోయినా తనకి ఈ ప్రపంచంతో పని ఉందట. తనకి పరువు చాలా ముఖ్యం అట... అంత పరువు తీసేపనులు నేనేం చేస్తున్నానని?"

ఆయాసంతో ఆగింది ప్రత్యూష. కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయింది ధాత్రి.

"నువ్వు నెమ్మదిగా నచ్చచెప్పలేకపోయావా?"

విరక్తిగా తల పంకించింది ప్రత్యూష.

"లాభంలేదే, తను నిష్కర్షగా చెప్పాడు. తన మాటకి

ఎందుకు? ఏమిటి? ఎలాగ అని నేను ఎదురు మాట్లాడకూడదట. మౌనంగా తను చెప్పినట్లు చేయాలి. అంతే నా కోసం నీ అలవాట్లు మానుకుంటావా అని అడిగాను. అది జరగని పని అన్నాడు. మరి నేనేనా అంత చీమూ నెత్తురూ లేని జీవచ్ఛవాన్ని?"

"ఆనంద్ తన స్వభావాన్ని నీ దగ్గర ఎప్పుడూ దాచలేదు ప్రత్యూషా! తను అప్పుడు కూడా ఇలాగే ఉండేవాడు. అయినా నువ్విష్టపడి చేసుకున్నావు..."

"నిజమే. నా సాహచర్యంతో తనలో మార్పు వస్తుందని ఆశ పడ్డాను. కనీసం వచ్చేవరకూ నేనే రాజీపడాలి అని నిర్ణయించుకున్నాను. కానీ అది వట్టి అడియాస" కొండంత దిగులు ధ్వనించింది ప్రత్యూష గొంతులో.

"నువ్వు కోపగించుకోనంటే ఓ మాట చెప్పనా?" బెదురుతూనే అడిగింది ధాత్రి. నిరాశగా చూసింది ప్రత్యూష.

"ఆనంద్‌కి నువ్వంటే ప్రేమేగా?"

"అందులో సందేహమే లేదు. నేను అడిగితే ఇప్పుడే నా కోసం ఓ ఫారిన్ కారు కొంటాడు. ఫాక్టరీ కట్టిస్తాడు. ఇంకా కావాలంటే ఓ పాలరాతి మహల్ కట్టిస్తాడు. కానీ నాకు కావలసింది మాత్రం వ్యక్తిత్వం, స్వేచ్ఛ, ఆత్మగౌరవం!..."

"అది కాదే, ఆనంద్ పరాయివాడు కాదు. నీ భర్త. నిన్ను మనసారా ప్రేమించే మనిషి. అలాంటి మనిషి కోసం నువ్వే కాస్త రాజీపడితే..."

కందగడ్డలా అయిన ప్రత్యూష ముఖంవైపు చూసి అర్థోక్తిలోనే ఆపేసింది ధాత్రి.

"ధాత్రీ, నువ్వేనా ఈ మాట అంటున్నది? ఒక్కసారి గుర్తుచేసుకో. ఎమ్.ఎ. చేసి డాక్టరేట్ చేయాలని పగలూ రాత్రీ నేనెలా కలలు కనేదాన్ని? తనకి ఇష్టంకాదని బియ్యేతో నా చదువు ఆపేయలేదా? ఇది రాజీపడి చేయలేదే. నా ప్రాణం అయిన నా మనిషి కోసం చేశాను. అలాగే ఇంట్లో ఏం తోచడంలేదు. జాబ్ చేస్తానంటే అక్కర్లేదన్నాడు. 'సరే, ఇల్లాలిగా అతనికి మరింత దగ్గరవ్వాలని, ఆ ప్రయత్నం కూడా విరమించుకున్నాను. చివరికి ఏం సాధించాను? ఏం దగ్గరయ్యాను? తను ఏమైనా మారాడా? చివరికి ఎన్నాళ్ళిలా నన్ను నేను చంపుకొంటూ బ్రతకాలి. భార్యగా అతని కోరికలకి అనుగుణంగా మారే నాకు అదే అధికారంతో అతను నా అభిప్రాయాలు అర్థంచేసుకోవాలని, నా మాటకి విలువ ఇవ్వాలని కోరుకోవటం తప్పా? భార్య అభిప్రాయాలకి ఏమాత్రం విలువ ఇవ్వలేని అతనికి ఆమెని శాసించే అధికారం మాత్రం ఎక్కడిది?"

ధాత్రి బదులు చెప్పలేకపోయింది. నిజమే, ప్రత్యూష పల్లెటూరి పిల్లకాదు. చదువు, సంస్కారం, వ్యక్తిత్వం ఉన్న ఓ ఆడపిల్ల! ఆత్మగౌరవం చంపుకుని బ్రతకటం ఆమెకెట్లా చేతనవుతుంది?

కొద్ది క్షణాలు మౌనంగా గడిచాయి. తల తిప్పి ప్రత్యూషవైపు చూసింది ధాత్రి.

కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకుని ఉందామె. అలసటనీ, నిద్రలేమినీ సూచిస్తున్నాయి... కళ్ళు చుట్టూ ఉన్న నల్లటి వలయాలు. చెదిరిన జుట్టు, అలసిన ముఖం... జాలివేసింది ధాత్రికి, స్నేహితురాలిని చూసి.

"ప్రత్యూ! పోయి పడుకో. నేను రాజాకి చెప్పి మాట్లాడమంటాను. లేదా నేను రాజా వెళ్తాం. ఆవేశం దిగితేనే కొన్ని సమస్యలకి పరిష్కారాలు కన్పిస్తాయి. మనస్సులో ఏం పెట్టుకోకుండా నిద్రపో. ఆనంద్ మాత్రం నిన్ను వదిలి ఉండగలడా? రేపీపాటికి ఇక్కడ ఉండడా?"

విరక్తితో కూడిన నీరసహాసం ఒకటి ప్రత్యూష పెదవులపై కదిలి మాయమైంది. మరునాడే ఆఫీస్ నుంచి ఆనంద్‌కి ఫోన్ చేసింది ధాత్రి.

"హలో! ఆనంద్ హియర్."

"నేను ధాత్రిని... ప్రత్యూష నా దగ్గరకి వచ్చింది..."

"..."

"ఆనంద్! ఏమిటిదంతా? మీలో మీకు ఏమిటీ అపోహలు, అర్థంలేని పట్టుదల?"

"పట్టుదల నాకేనా? తనకి లేదా?"

"ఇద్దరికీ ఉంది కనుకే ఈ బాధ. సరే, ఈవినింగ్ నేను వస్తాను. ఇంట్లోనే ఉంటావా?"

"ఆఁ..." అని ఫోన్ పెట్టేసాడు ఆనంద్.

భర్తకి ఫోన్ చేసి ఆఫీస్ అయ్యాక తనని పికప్ చేసుకోమని, ఆనంద్ దగ్గరికి వెళ్ళాలని చెప్పింది ధాత్రి.

* * *

"ప్చ్... నువ్వు తొందరపడ్తున్నావు ఆనంద్!..."

"తొందరపడేది నేను కాదురా! ఆమెకేమైనా నా మాట మీద విలువుంటే అలా చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్ళిపోయేదా? అంటే అర్థం ఆమెకి నేను అక్కర్లేదనేగా?" ఆవేశంగా అన్నాడు ఆనంద్.

ధాత్రి కళ్ళముందు ప్రత్యూష పాలిపోయిన చెక్కిళ్ళు, లోతుకుపోయిన కళ్ళు కదలాడాయి. ఆమెకి ఆనంద్ మూర్ఖత్వంవల్ల చిరాకు కలిగింది.

"మొదట్నుంచీ నువ్వు అదే తప్పు చేస్తున్నావ్ ఆనంద్! ప్రత్యూషని ఎప్పుడూ కూడా సరిగ్గా అర్థంచేసుకోలేదు. ఆమెకి నువ్వు అక్కర్లేదా? బాగుంది. చక్కగా ఉంది. అసలు నువ్వు దాన్ని పరీక్షగా చూసావా, ఈమధ్య కాలంలో? దాని మనస్సు ఎంత సున్నితమో నీకు తెలియదా? తిండితిప్పలు లేకుండా అది చిక్కిపోతుంటే కనీసం ఏం తింటుందో ఎప్పుడైనా గమనించావా?"

"పంతానికి రోజుల తరబడి ఉపవాసాలు చేస్తుంటే నేనేం చేయాలి? తనకి నా మాట కన్నా తన పంతమే ఎక్కువ."

"ఇదే మాట తను కూడా అంటోంది. అబద్ధమా?" సూటిగా చూస్తూ అడిగింది.

"నీకు తెలును ధాత్రీ! నేను నా అభిప్రాయాలను మార్చుకోలేను. ప్రత్యూష వాటిని కాదంటే సహించలేను. ఇది నా కుసంస్కారమే అనుకో, మూర్ఖత్వమే అనుకో, మరేమైనా అనుకో. ప్రత్యూష నాకు అనుగుణంగా ఉండాలి అంతే. ఆమె ఏది కోరినా నేనిస్తాను. కానీ నా మాటకి మాత్రం ఎదురు చెప్పకూడదు. నీకిది కూడా తెలును. ఐ లవ్ ప్రత్యూష."

స్థిరంగా చెప్పాడు ఆనంద్. ధాత్రికి అరికాలిమంట నెత్తికెక్కింది. కోపంగా ఏదో అనబోతున్న ధాత్రి చేయి మీద చేయివేసి ఆపేసాడు రాజా.

"ఆనంద్! ప్రత్యూష నీ భార్యే కాదు. మనందరికీ స్నేహితురాలు కూడా. ఆమెను చూసి, అర్థంచేసుకుని ప్రేమించిన తర్వాతే ఆమెను పెళ్ళి చేసుకున్నావు. ఒక్క విషయం ఆలోచించు. భార్య కోసం భర్త, భర్త కోసం భార్య రాజీపడినంత మాత్రాన వాళ్ళ ఆత్మగౌరవానికి ఏదో దెబ్బ తగిలిపోయిందని భావించకూడదు. వారిద్దరూ ఒకరిలో ఒకరు సగభాగం. ఒక చేయికి దెబ్బ తగిలితే మరో చేత్తో రాస్కుంటాం. ఒక కన్నుకి దెబ్బ తగిలితే మరో కన్నుతో చూస్తాం. అంతేకానీ అది చూడకపోతే నేను మాత్రం ఎందుకు చూడాలి అని కన్ను పంతానికి పోదు. భార్యకి భర్తకన్నా ఎక్కువైన వాళ్ళు భర్తకి భార్యకన్నా ఆప్తులు ఎవరూ ఉండరు. ఒకవేళ ఉన్నా వాళ్ళ దారి వేరు. మంత్రాలకన్నా అగ్నిసాక్షికన్నా పవిత్రమైనది సహజీవనం. మనసా వాచా కర్మగా కలసి బ్రతుకుతారు భార్యాభర్తలు. కష్టాలు, సుఖాలు, సమస్యలు, కన్నీళ్ళు, బాధలు, భోగాలు అన్నీ కూడా ఇద్దరూ సగంసగం పంచుకోవాలి. ఒకరి కోసం ఒకరు బ్రతకాలి. ఒకరి కోసం ఒకరు అలవాట్లు మార్చుకోవాలి. ఒకరి కోసం ఒకరు పట్టుదలలు విడిచిపెట్టాలి. ఒకరి గెలుపు ఇద్దరి గెలుపు, ఒకరి ఓటమి ఇద్దరి ఓటమీ కావాలి. ఒకరు ఆవేశపడితే ఒకరు తగ్గాలి. ఒకరు తొందరపడితే ఒకరు ఓర్పు వహించాలి.

"తొందరపడటం కేవలం భర్త వంతు, సహనం చూపడం కేవలం భార్య వంతు ఎంతమాత్రం కాదు. భార్యకి కోపం వస్తే మౌనంగా ఉండిపోవాలి. అంతమాత్రాన తప్పు కాదు. నేను మగవాడిని నేనెందుకు తగ్గాలి అనే భావం మగవాడిలో ఉందంటే వారి మధ్య సరైన వైవాహికబంధం లేదన్నమాట. అట్లాగే ఆడదాన్ని కనుక నేను తగ్గాలా? మగవాడికి అంత అహంకారం ఎందుకు? అని భార్య అనుకోకూడదు. ఎందుకంటే భర్త కేవలం మగవాడే కాదు తనకు ఆప్తుడు, ఆత్మీయుడు కనుక. నాకిష్టమైన ఈ నా మనిషి కోసం నాకిష్టం లేకపోయినా ఈ పని చేస్తాను అని భార్యాభర్తలు ఇద్దరూ కూడా అనుకుంటే వారిమధ్య తేడాలే రావు. ఇప్పుడు నువ్వన్నావు చూడు, 'నేను నా అభిప్రాయాలు మార్చుకోను. ఏమైనా అనుకో' అని. అది చాలా పొరపాటు. ఎందుకో తెలుసా? పెళ్ళి అంటూ అయ్యాక నీ జీవితం నీ ఒక్కడిదే కాదు. నీ భార్య అనబడే ఇంకొక వ్యక్తిది కూడా. ఆమెకి కూడా నీ మీద సర్వాధికారాలు ఉంటాయి. 'ఆనంద్‌కి ప్రత్యూషనిచ్చి' అని శుభలేఖల్లో వ్రాయించినంత మాత్రాన ఆమెని మాత్రమే నీకు ఇవ్వడం కాదు. నిన్ను కూడా ఆమెకి ఇస్తున్నారు. అలాంటప్పుడు తప్పనిసరిగా నీ అభిప్రాయాలను అలవాట్లనూ మార్చుకోవాలి. 'తప్పనిసరిగా' అనే మాట రిపీట్ చేస్తున్నాను.

"నేను ప్రత్యూషనే సపోర్ట్ చేస్తున్నానని అనుకోకుండా నీకు నువ్వే ఒకసారి ఆలోచించు. ఆమె నీ కోసం ఎన్నిటిని వదులుకుందో గుర్తుచేసుకో. అలాగే ఆమె కోసం నువ్వేం చేసావో కూడా గుర్తుతెచ్చుకో.

"భార్య అంటే సిగ్గు, అభిమానం, పౌరుషం, చీమూ నెత్తురూ లేని జీవచ్ఛవం కాదురా! ఆమె కూడా మనిషే. భగవంతుడు ఆమెని కూడా మనని సృష్టించినట్లే సృష్టించాడు. పైగా మన అదృష్టవశాత్తూ వారిలో టెండర్‌నెస్, మెతకదనం పెట్టాడు. అందుకు మనం సంతోషించాలి. ప్రత్యూష అందరిలాంటి ఆడపిల్లకాదు. షి యాజ్ వాల్యూబుల్ గిఫ్ట్ గివెన్ బై గాడ్ టు యు. ఆమె విలువ అర్థంచేసుకో. తను నీ కోసం చాలా మారింది. ఇంతమార్పుని ఆమెలో నేనసలు ఎక్స్‌పెక్ట్ చేయలేదు. ఇప్పటికైనా ఆమెని అర్థంచేసుకుని నీ తప్పు సరిదిద్దుకో. ప్రత్యూష పుట్టింటికి వెళ్ళదు. నా ఇంట్లో ఉంటుంది.

నీకు మా ఇద్దరి మీద నమ్మకం ఉంటే, ఆమెలేని లోటు గుర్తిస్తే, ఆమె సహచర్యం లేనిదే జీవించలేననుకుంటే, ముఖ్యంగా ఆమె కోసం నువ్వేమాత్రమైనా మారగలిగితే ఆ క్షణమే వచ్చి ఆమెను తీసుకెళ్ళు. ఈలోగా ప్రత్యూష మనస్సు మారి ఆమె రాజీపడితే నేనే పంపించేస్తాను. కానీ ఆమెనే రాజీపడి రానీ అని నువ్వు ఎదురుచూడకు. నీకెప్పుడు ఆమెని వచ్చి తీసుకు పోవాలన్పిస్తే వెంటనే వచ్చి తీసుకుపో."

చెప్పటం ఆపి ఆనంద్ దగ్గరగా వచ్చి భుజం మీద తట్టాడు రాజా.

"విద్యావంతుడిగా, సంస్కారవంతుడిగా ఆలోచించు. జీవితంలో కొన్నిటిని ఒకసారి పోగొట్టుకుంటే తిరిగి ఎప్పటికీ పొందలేము. ప్రత్యూష పూర్తిగా నీకు దూరం కాకముందే ఆమెను నీ దగ్గరికి చేర్చుకో. ఆమె ఎక్కడున్నా ఎలా ఉన్నా నీ మనిషి. నేను కేవలం ఆమెకి ఆశ్రయం ఇస్తున్నాను అంతే. థింక్ వెల్."

ఆనంద్ మాట్లాడలేదు. రాజా భార్యవైపు చూసాడు వెళ్దామా అన్నట్లు ధాత్రి నిలబడింది. "రాజా అన్నీ చెప్పాడు కానీ ఒక్కటి మరిచిపోయాడు ఆనంద్!... అదేమిటంటే ప్రత్యూషకి నువ్వంటే ప్రాణం... ఓ.కే. ఇంక మేం వెళ్ళొస్తాం."

రాజాని అనుసరించింది ధాత్రి. తల ఒక్కసారి విదిల్చి వెనక్కివాలి అశాంతిగా కళ్ళు మూసుకున్నాడు ఆనంద్.

* * *

ప్రత్యూష గురించి ఆలోచిస్తూంటే నిద్ర పట్టలేదు ధాత్రికి. లేచి మంచినీళ్ళు తీసుకుని త్రాగి ఆమె గదివైపు తొంగి చూసింది. తలగడలో ముఖం దాచుకుని వెక్కుతున్న ఆమెని చూడగానే మనస్సు ద్రవించింది. చప్పున గ్లాస్ టీపాయ్ మీద పెట్టి నాలుగు అడుగుల్లో ప్రత్యూషని చేరింది.

"ప్రత్యూ!..." వెన్నుమీద చేయివేసి నిమురుతూ లాలనగా పిలిచింది. ఆమె గొంతు వినగానే దుఃఖం కట్టలు తెగింది ప్రత్యూషలో. ధాత్రి ఒడిలో తల దాచుకుని బావురుమంది.

"ఏయ్ పిచ్చీ! ఏమిటే ఇది? ఇప్పుడేమైందనీ? నిద్ర పోకుండా నువ్వు చేస్తున్న పని ఇదా... ఊర్కో.... ఆనంద్‌ని చూడాలనుందా.? ఊఁ?" మృదువుగా అడిగింది.

అవునన్నట్లు తల ఊపింది పసిపిల్లలా.

"అయితే దానికి ఏడవాలా? ఫోన్ చేసి పిలుస్తానుండు."

"వద్దు ధాత్రీ! పదిహేనురోజులు తన కోసం ఎదురు చూసాను. తనను విడిచి నేనుండలేనట్లే నన్ను విడిచి తను కూడా ఉండలేడనుకున్నాను. కానీ తను ఉండగలిగాడు చూసావా? రియల్లీ హి యాజ్ గ్రేట్ ధాత్రీ! నా భర్త చాలా గొప్పవాడు" మళ్ళీ ఆమె కళ్ళు కన్నీటి కడవలయ్యాయి.

"ప్రత్యూ! ఇప్పటికైనా ఏమైంది? నీకు ఆనంద్ దగ్గరికి వెళ్ళాలనుంటే వెళ్ళిపో మళ్ళీ వచ్చావని చెప్పే సంస్కారహీనుడు ఆనంద్ అని అనుకోను. ఏమంటావు?" స్నేహపూర్వకంగా ప్రత్యూష భుజాల చుట్టూ చేయివేసింది ధాత్రి. ఆమె బదులు పలకలేదు. కన్నీళ్ళు చెంపలమీదకి జారుతుండగా మౌనంగా సీలింగ్ కేసి చూస్తూండిపోయింది.

"సరే, రేపు ఆలోచిద్దాంలే. ఇప్పుడు నిద్రపో. కళ్ళు మూసుకుంటే నిద్ర అదే వస్తుంది." దుప్పటి సరిగ్గా కప్పి లాలనగా ముంగురులు సర్దింది ధాత్రి.

ఉదయం వంటగదిలో కాఫీ కలుపుతున్న ధాత్రి కాలింగ్‌బెల్ విని ముందుగదిలోకి వచ్చి తలుపుతీసింది. ఎదురుగా ఆనంద్! సంభ్రమంగా చూస్తూ పక్కకి తొలగింది.

"హలో, గుడ్‌మార్నింగ్! ఏమిటింత ఉదయాన్నే... రా...రా... ఈరోజు నా చేత్తో వేడివేడి కాఫీ నీకు ప్రాప్తం ఉన్నట్లుంది. అలా కూర్చో..." అని చెప్పి రాజాని నిద్రలేపి ఆనంద్ వచ్చాడని చెప్పింది. నవ్వుకుంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి వచ్చాడు రాజా.

"హలో... ఏరా, ఇంత పొద్దున్నే దిగబడ్డావు." బద్ధకంగా ఆనంద్ పక్కన కూలబడ్డాడు.

"ఇది పొద్దున్నా? ఇప్పుడు టైమెంతో తెలుసా? ఎనిమిదిన్నర..." నవ్వి వాచీ అతని ముఖం ముందు పెట్టాడు. ధాత్రి కాఫీ తెచ్చి ఇద్దరికీ ఇచ్చింది. తను కూడా ఓ కప్పు తెచ్చుకుని వారి ఎదురుగా కూర్చుంది.

"ప్రత్యూష ఇంకా లేవలేదా?" రాజా అడిగాడు.

"లేదు. రాత్రి చాలాసేపటివరకూ నిద్రపోలేదది. అర్ధరాత్రి లేచి ఏడుస్తూ కూర్చుంది. ఓ పావుగంటపాటు మాటలు చెప్పి పడుకోబెట్టాను."

"సెన్సిటివ్‌గర్ల్..." అన్నాడు రాజా కాఫీ కప్పు పక్కన పెడుతూ.

ఆనంద్ ఏం మాట్లాడలేదు. అతని కళ్ళు దీక్షగా ఫ్లోరింగ్‌వైపు చూస్తున్నాయి. మౌనంగా కాఫీ సిప్ చేస్తున్నాడు.

"ప్రత్యూషని లేవనా?" ధాత్రి ఆనంద్‌ని అడిగింది.

"వద్దు. పడుకోనియ్యి. తనే లేస్తుంది."

"నువ్వు స్నానం చేయకపోతే చేసెయ్యరాదూ, టిఫిన్ పెడతాను."

"నేను స్నానంచేసి వచ్చాను కానీ టిఫిన్ మాత్రం వద్దు. ఆకలిగా లేదు." టేబుల్‌మీదున్న పేపర్ అందుకుని సోఫాలో వెనక్కివాలాడు ఆనంద్. అలసటగా, నీరసంగా కన్పిస్తున్న అతన్ని చూసి నిట్టూర్చి లోపలికి వెళ్ళిపోయింది ధాత్రి.

స్నానం చేసి వచ్చి బలవంతాన ఆనంద్ చేతకూడా టిఫిన్ తినిపించి ఇద్దరూ రెడీ అయ్యారు ఆఫీస్‌లకి.

"ధాత్రీ! ప్రత్యూషని లేపు లేకపోతే ఆనంద్ వస్తే చెప్పవా అంటూ నిన్ను చంపినా చంపుతుంది."

"వాళ్ళ ఆయన్నే వెళ్ళి మేలుకొలపమను. నేనెందుకు లేపుతాను?"

ఆనంద్ నవ్వుకుంటూ ప్రత్యూష ఉన్న గదిలోకి వెళ్లాడు. చెదిరిన జుట్టు వీపంతా పరుచుకోగా బోర్లాపడుకుంది ప్రత్యూష. కన్నీటి చారికలు కట్టిన బుగ్గల మీద మృదువుగా రాస్తూ "ప్రత్యూ!..." అని పిలిచాడు ఆనంద్ నెమ్మదిగా. పలకకపోయేసరికి ముందుకి వంగి సున్నితంగా చెంపలమీద ముద్దు పెట్టుకున్నాడు.

"ప్రత్యూ! ఏయ్ పిచ్చీ! లేమ్మా!" చేతులుపట్టి తన చెంపలకానించుకున్నాడు. ఆనంద్ చేతి నుండి అచేతనంగా జారిపోయింది ప్రత్యూష చెయ్యి. అతడి పెదవులపై చిరునవ్వు ఎగిరిపోయింది. హృదయస్పందన ఆగినట్లయింది. కంగారుగా ప్రత్యూష భుజాలు పట్టి కుదిపాడు. "ప్రత్యూ! ప్రత్యూషా!... అంటూ. ఆమెలో చలనం లేదు. "రాజా!" అంటూ పెద్దగా కేకపెట్టాడు వణికిపోతూ. రాజా ధాత్రీ ఇద్దరూ పరుగెట్టుకుంటూ వచ్చారు.

"రాజా! ప్రత్యూష... ప్రత్యూష లేవడంలేదురా. నాకు భయంగా ఉంది... ఒక్కసారి చూడరా..."

రాజా ఒక్క ఉదుటున ముందుకివచ్చి ప్రత్యూషని కదిలించి ముక్కు దగ్గర వేలు పెట్టి చూసి షాక్ తిన్నట్లు చేయి వెనక్కి తీస్కున్నాడు.

"రాజా! ప్రత్యూషకేమైంది? డాక్టర్‌కి ఫోన్ చేయి తొందరగా..." ఏడుస్తూ ప్రత్యూషని కుదపసాగింది ధాత్రి.

విగ్రహంలా నిలబడిపోయిన రాజాకి పెదవులు అస్పష్టంగా కదిలాయి.

"అవసరం లేదు ధాత్రీ! షి యాజ్ నో మోర్."

"నో..."గావుకేకపెట్టాడు ఆనంద్. సర్పదష్టురాలిలా చప్పున ప్రత్యూషని వదిలి విభ్రమంగా చూసింది ధాత్రి

"నో... ఇది నిజం కాదు. ప్రత్యూష ఇంత పని చేయదు... నువ్వు మరోసారి చూడు రాజా!" బావురుమంటూ అతన్ని చుట్టుకుపోయింది ధాత్రి.

ప్రత్యూష తల దగ్గరున్న కాగితం మీద పడింది రాజా దృష్టి. దానిమీద 'ఆనంద్' అన్న సంబోధన చూసి ఆనంద్‌కి ఇచ్చాడు, అతని కళ్ళు నిండా నీళ్ళు నిండి ధాత్రి తలమీద పడ్డాయి ఆ కన్నీళ్ళు!

గబాల్న మడతలు విప్పాడు ఆనంద్. అతడి చూపులు పిచ్చిగా అక్షరాల వెంట పరుగులు తీయసాగాయి.

ఆనంద్.. నా ప్రాణం...

చివరిసారిగా ఓడిపోతోంది నీ ప్రత్యూష! ఈ క్షణం వరకూ నీకు నేను కావాలనే అనుకున్నాను. కానీ ఇప్పుడే నిర్ణయించుకున్నాను, నేను లేకపోయినా నీకేం నష్టంలేదని. నీ అభిప్రాయాలకి నువ్విచ్చే విలువకి, ఇంత స్థిరమైన నీ పట్టుదలకి అభినందిస్తున్నాను ఆనంద్!

నేను లేకపోయినా నువ్వుండగలవేమో కానీ నీకు దూరమై నేను బ్రతకలేను. నీ బాహువులకి దూరమైన నాకు భవిష్యత్తు మీద కోరిక లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. బహుశా నీ జీవితంలో ఇది చాలా పెద్ద గెలుపు కావచ్చు. అవునా?

ఆనంద్! నువ్వంటే నాకు ప్రాణం. నా ఆత్మాభిమానం ప్రాణానికి ప్రాణం. దాన్ని చంపుకోలేకే నేను...

చివరిగా ఒక్కమాట చెప్పకుండా ఉండలేకపోతున్నాను.

ఆనంద్! స్టిల్ ఐ లవ్ యూ! మృత్యువులో కూడా...

నీ ప్రత్యూష

పిచ్చి పట్టినట్లు మంచానికి తల బాదుకున్నాడు ఆనంద్.

"ప్రత్యూషా! ఎందుకింత పని చేసావు? ఒక్క రాత్రి నా కోసం ఆగలేకపోయావా? నేను గెలవలేదు ప్రత్యూ! ఓడిపోయాను. ఘోరంగా ఓడిపోయాను. నేను నీ కోసం మారిపోయివచ్చాను. ఒక్కసారి కళ్ళు తెరు ప్రత్యూషా! ఒక్కసారి కళ్ళు తెరువు." పసిపిల్లాడికన్నా అధ్వాన్నంగా వెక్కివెక్కి ఏడుస్తున్న ఆనంద్ భుజం మీద ఓదార్పుగా చేయి వేసాడు రాజా. □